


ఉష్ణోగ్రత: గరిష్ఠం 39.7 కనిష్ఠం 21.0

అందరికీ రంజాన్ శుభాకాంక్షలు



ముస్లింలందరికీ రంజాన్ శుభాకాంక్షలు. నెలరోజులు నిష్ఠతో ఉపవాస దీక్షలు చేసిన అనంతరం జరుపుకునే అతిముఖ్యమైన పండుగ రంజాన్. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య పండగను జరుపుకోవాలి.

-గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనసభ స్పీకర్



కొడంగల్: వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం వినిపిస్తున్న పురోహితులు

విశ్వావసు.. విజయోస్తు!

ఘనంగా ఉగాది సంబురాలు.. ఊరూరా పంచాంగ శ్రవణాలు



ఘట్‌కేసర్: అన్నోజిగూడలోని అయ్యప్ప ఆలయంలో..

తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ ఇంట్లో షడ్రుచులతో ఉగాది పచ్చడి చేసి చేసి పిల్లలు, పెద్దలు పంచుకున్నారు. పూర్ణంతో కూడిన బెల్లం, చక్కెర భక్ష్యాలను తయారు చేసుకొని ఆరగించారు. సాయంత్రం దేవాలయాలలో అర్చకులు పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు.

-ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, మార్చి30



పరిగి: హనుమాన్ ఆలయంలో పంచాంగ శ్రవణం



వికారాబాద్: ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న శుభప్రద్ పటేల్



తాండూరు: ప్రార్థనలు చేసేందుకు ముస్తాబైన ఈద్గా



విద్యుత్‌దీపాల వెలుగుల్లో మేడ్చల్ పెద్ద మసీదు

ఈద్.. ముబారక్

నేడే రంజాన్.. ఏర్పాట్లు సిద్ధం చేసుకున్న ముస్లింలు

ప్రార్థనలు చేసేందుకు మసీదులు, ఈద్గాలు సిద్ధం

రంజాన్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఈద్గాలు ముస్తాబయ్యాయి. ముస్లింలు ప్రార్థనలు చేసుకు నేందుకు వాటిని శుభ్రం చేయించి శోభాయమానంగా అలంకరించారు. అలాగే మసీద్‌లు రంగురంగుల విద్యుత్ దీపాల మధ్య జిగేల్‌మంటున్నాయి. పండుగ సందర్భంగా కొత్త డ్రెస్సులు, ఇతర సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లలో సందడి వాతావరణం నెలకొంది. కొనుగోలుదారులతో దుకాణ సముదాయాలు కిక్కిరిసిపోయాయి.

-మేడ్చల్ టౌన్, మార్చి30 (ఆంధ్రజ్యోతి)

గ్రూప్-1 ఫలితాల్లో వర్షితకు 100వ ర్యాంక్



వికారాబాద్, మార్చి30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): టీజీపీఎస్సీ ఆదివారం ప్రకటించిన గ్రూప్-1 జనరల్ ర్యాంకుల్లో వికారాబాద్ పట్టణానికి చెందిన కె.వర్షిత రాష్ట్ర స్థాయిలో 100వ ర్యాంకు సాధించారు. 487.5 మార్కులు సాధించిన ఆమె మల్టీజోన్-2లో 40వ ర్యాంకు తెచ్చుకున్నారు. ధారూరు మండలం, నాగారం గ్రామానికి చెందిన వర్షిత వికారాబాద్ పట్టణంలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదివారు. ఇంటర్ హైదరాబాద్‌లో పూర్తి చేయగా, ఆ తర్వాత రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్‌లో బీఎస్సీ, ఎమ్మెస్సీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆమె యాదాద్రి భువనగిరి జిల్లా, సంస్థాన్ నారాయణపూర్ మండల వ్యవసాయాధికారిగా పని చేస్తున్నారు. మండల వ్యవసాయాధి కారుల నియామకం కోసం నిర్వహించిన పరీక్షలోనూ ఆమె రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు సాధించారు. ఇటీవల ప్రకటించిన గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 215వ ర్యాంకు, గ్రూప్-4 ఫలితాల్లో 143వ ర్యాంకుతో వికారాబాద్ జిల్లాలో టాపర్‌గా నిలిచారు. కాగా, ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. 'ఇంట్లోనే ఉంటూ ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకున్నాను. రెండున్నర సంవత్సరాలుగా హార్డ్‌వర్క్ చేయగా, తల్లిదండ్రులు నవనీత, నరేందర్‌రెడ్డి, సోదరి తన వెన్నంటి ఉండి ప్రోత్సహించారని వర్షిత చెప్పారు.

సస్యరెడ్డికి 347వ ర్యాంక్



కోట్‌పల్లి, మార్చి30 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్ష ఫలితాల్లో వికారాబాద్ జిల్లా, మోత్కుపల్లి గ్రామానికి చెందిన కెరెల్లి సస్యరెడ్డి 347వ ర్యాంక్ సాధించింది. తన తండ్రి వెంకట్‌రెడ్డి ప్రోత్సాహంతో మొదటి అటెంప్ట్‌లోనే సత్తాచాటి 462.5 మార్కులు సాధించింది. ఆమె విద్యాభ్యాసం 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు హైదరాబాద్‌లో, ఇంటర్మీడియట్ బెంగళూర్‌లో, డిగ్రీ ఢిల్లీలోని కళాశాలలో బీఏ పొలిటికల్ సైన్స్ ఆనర్స్ పూర్తి చేసింది. ప్రస్తుతం ఎంఏ పొలిటికల్ సైన్స్ చదువుతోంది. కళాశాలకు వెళ్తూ గ్రూప్-1లో సస్యారెడ్డి ఉత్తమ ర్యాంక్ సాధించడంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇసుకాసురులు!

సిండికేట్‌గా మారి పరిగిలో జోరుగా ఇసుక దందా!

కృత్రిమ కొరత సృష్టించి భారీ ధరకు అమ్మకాలు

డిమాండ్‌ను బట్టి అమాంతం పెంచేస్తున్న ఇసుక ధరలు

పదిహేను రోజుల వ్యవధిలోనే టన్నుకు రూ.వెయ్యి పెంపు

మామూళ్ల మత్తులో అధికారులు!

అధిక ధరకు కొనలేక ఇబ్బందుల్లో సామాన్య ప్రజలు



పరిగిలో ఇసుకను డంప్ చేస్తున్న ట్రాక్టర్(ఫైల్)

పరిగి కేంద్రంగా ఇసుక అక్రమ దందా జోరుగా సాగుతోంది. పలువురు వ్యాపారులు సిండికేట్‌గా మారి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అభివృద్ధి పనుల పేరిట మరికొందరు అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఇసుక వ్యాపారాన్ని నడిపిస్తున్నారు. అనుమతి లేని ఇసుక లారీలు నిత్యం పరిగి సబ్ డివిజన్‌లోని ప్రభుత్వ కార్యాలయాల ముందు నుంచే తరలిపోతున్నాయి. కొందరు అక్రమ వ్యాపారులే అనుమతి ఉన్న ఇసుకలారీలనే అడ్డుకుంటూ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొస్తున్నారు. అనుమతి ఉందని పోలీసులు చెప్పినా వాగ్వాదానికి దిగడం వారి బరితెగింపుకు నిదర్శనంగా నిలుస్తోంది. తమ ఇసుక తప్ప, ఇతరుల ఇసుకను కొనొద్దని హుకుం జారీ చేస్తూ జోరుగా వ్యాపారం సాగిస్తున్నారు.

పరిగి, మార్చి30(ఆంధ్రజ్యోతి): ఇళ్లు నిర్మించుకునే వారికి, అభివృద్ధి పనుల కోసం ఇసుక లభ్యతను ప్రభుత్వం సులభతరం చేసిన సంగతి విదితమే. అయితే ఇళ్ల నిర్మాణాల పేరిట వ్యాపారులు ఇష్టారీతిన అధిక ధరలకు విక్రయిస్తూ కాసులు దండుకుంటున్నారు. అనుమతి ఉన్న లారీలను సైతం సిండికేటుగాళ్ళు బరితెగించి అడ్డుకుంటున్నారు. తాజాగా అనుమతులతో బొంరాస్‌పేట్ నుంచి పరిగి మీదుగా తరలిస్తున్న ఇసుక లారీని సిండికేట్ వ్యాపారులు అడ్డుకోవడం గమనార్హం. ఈ అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు

మిగతా 8వ పేజీలో...

కృత్రిమ కొరత సృష్టించి

బొంరాసిపేట్, యాలాల్ ప్రాంతాల్లో ఇసుక వనరులు ఉన్నాయి. ప్రభుత్వ పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అధికారులు స్థానిక ఇసుకకే అనుమతి ఇస్తున్నారు. ఈ ఇసుక కాకుండా కరీంనగర్, పెద్దంపల్లి, మల్లారం, మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌సాగర్, కోస్గీ ప్రాంతాల నుంచి పరిగికి ఇసుకను దిగుమతి చేసుకుంటున్నారు. ఒక్క లారీ వే బిల్లుతో తీసుకొస్తే దానితో పాటు మరో రెండు లారీల ఇసుకను అదనంగా తీసుకొచ్చి దొడ్డిదారిన అమ్ముకుంటున్నారు. దీంతో ఇళ్లు, ఇతర నిర్మాణ పనులు చేపట్టే వారికి ఇసుక తీసుకురావడానికి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయంటూ రేట్లను అమాంతం పెంచుతున్నారు. కృత్రిమ డిమాండ్ సృష్టించి డబ్బును దండుకుంటున్నారు. నెల క్రితం టన్ను ఇసుక ధర రూ.1,200 నుంచి రూ.1,500 వరకు ఉండేది. వారం నుంచి రూ.2,000ల నుంచి నాణ్యతను బట్టి రూ.2,600లకు విక్రయిస్తున్నారు.



తొట్టెలో లేగదూడ

లేగ దూడకు డోలారోహణం

ధారూరు, మార్చి30(ఆంధ్రజ్యోతి): ఆవుకు పుట్టిన 11 రోజుల లేగదూడకు ఓ రైతు డోలారోహణ(తొట్టెల) కార్యక్రమం నిర్వహించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఆదివారం మండల పరిధిలోని డీకే తండాకు చెందిన రైతు రమేశ్ ఈ తంతును నిర్వహించారు. పొలంలోనే తొట్టెలను ఏర్పాటు చేసి బంతిపూలతో అలంకరించి మగ లేగదూడను అందులో ఉంచి ఊయల ఊపుతూ రాము అని నామకరణం చేశాడు.



స్వామి వారి పల్లకీ సేవలో భక్తులు

ఘనంగా సోమసాద్ జాతర

బషీరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ మండల పరిధిలోని భోజ్యానాయక్ తండాలో సోమాసాద్ మహారాజ్ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. వందల ఏళ్ల కిందట తండాలో వెలసిన సోమసాద్(మర్రి వెంకటేశ్వర) స్వామి ఉత్సవాలను ఏటా ఉగాది రోజు గిరిజనులు ఘనంగా జరుపుకుంటారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పూజారులు శంకర్‌బావోజీ, సీతారంబావోజీ కుటంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహాన్ని పలకీలో ఊరేగించారు. జెండాలు చేత పట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ ఉత్సవాల్లో మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల మహిళా సంఘం అధ్యక్షురాలు శాంతి, గిరిజన పెద్దలు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో గిరిజన భక్తులు హాజరయ్యారు.



నీటితో నిండుగా దర్శనమిస్తున్న పెద్ద చెరువు



ఎండుతున్న వరిపంట

కళకళలాడుతున్న పెద్ద చెరువు.. ఎండుతున్న పంటలు

తూము పనిచేయక అందని నీరు

పత్తాలేని సాగునీటి శాఖ అధికారులు

తాండూరురూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అంతారం పెద్ద చెరువు నీటితో నిండుగా కళకళలాడుతోంది. అయినా చెరువు కింద ఆయకట్టు భూములకు నీరందడం లేదు. తూము పనిచేయక నీరు సరఫరా కావడం లేదు. దీంతో ఎండలకు వరిపంట ఎండుముఖం పడుతోంది. తూము పని చేయడం లేదన్న విషయాన్ని రైతులు సాగునీటి శాఖ అధికారులకు తెలపడంతో వచ్చి చూసి మరమ్మతులు చేపడతామని చెప్పి వెళ్లారు. కానీ పనులు మాత్రం చేపట్టలేదు. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దిక్కుతోచని స్థితితో ఆ రైతులంతా కలిసి డబ్బులు పోగు చేసుకుని ఓ మోటారు చెరువుకు పెట్టుకుని నీరు పారించుకున్నారు. ఇటీవల ఆ మోటారు సైతం కాలిపోవడంతో వరిపంటకు నీరందడం లేదు. అప్పుతెచ్చి పంటలు సాగు చేస్తే నష్టాల పాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాతృశాఖపై అనాసక్తి!

‘రెవెన్యూ’లో చేరేందుకు వెనకడుగు వేస్తున్న పూర్వ వీఆర్వో, వీఆర్ఏలు

పూర్వ వీఆర్వో, వీఆర్ఏలు మాతృ శాఖ(రెవెన్యూ)లోకి తిరిగి వెళ్లేందుకు అనాసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం తమకు చెప్పింది ఒకటి, అమల్లోకి తెచ్చింది మరొకటి అని మండిపడుతున్నారు. మునుపటి వీఆర్వో, వీఆర్ఏలు రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో అందించిన సర్వీస్‌ను సీనియారిటీలో లెక్కించబడదని ఉత్తర్వుల్లో పేర్కొనడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పాత సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోకపోతే రెవెన్యూ శాఖలోకి వెళ్లడం ఎందుకంటూ ప్రశ్నిస్తున్నారు.

సర్వీస్ ఇవ్వకపోవడంపై మండిపాటు

డిగ్రీ, ఇంటర్ పూర్తి చేసిన వారికే చాన్స్

ఎలిజిబిలిటీ- కమ్ - స్ర్కీనింగ్ ద్వారా ఎంపిక

రాష్ట్ర నాయకుల సంబరాలపై ఉద్యోగుల మండిపాటు

గ్రామ పాలన అధికారి పేరు మార్చాలని డిమాండ్



తాండూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన వారికే అవకాశమని పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియ కూడా అంతా కొత్తగా చేపడుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇలాంటి ఉత్తర్వులు ఇస్తే రాష్ట్ర నాయకులు స్వీట్లు పంచుకోవడమేమిటి అని సంఘ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొత్తగా చేపట్టనున్న గ్రామ పాలన అధికారులు(జీపీవో)గా ఎంపిక చేయడానికి ప్రభుత్వం.. పూర్వ వీఆర్వో, వీఆర్ఏలకు ఎలిజిబిలిటీ - కమ్ - స్ర్కీనింగ్ టెస్టును నిర్వహిస్తున్నట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. రెవెన్యూ

మిగతా 8వ పేజీలో...


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, పటేల్‌కిరణ్ తదితరులు

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

తాండూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తాండూరులోని శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఆలయ ప్రాంగణంలో వీరశైవ సంఘం ప్రతినిధులు, భద్రేశ్వర దేవస్థానం పాలకమండలి సభ్యులతో కలిసి ఆర్‌బీఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉత్సవాలు ఏప్రిల్ 15 నుంచి 20వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కరణం పురుషోత్తంరావు, డాక్టర్ సంపత్‌కుమార్, మాజీకౌన్సిలర్ బంటారం లావణ్య, వీరశైవ సమాజం ప్రతినిధులు జొన్నల బస్వరాజ్, వాలి శాంత్‌కుమార్, మోత్కుపల్లి చంద్రశేఖర్, ఆలయ ఈవో శేఖర్‌గౌడ్, ప్రసారం బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాల్లో ముందుండాలి

మొయినాబాద్ రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినప్పుడే వారికి భవిష్యత్తులో మంచి గుర్తింపు లభిస్తుందని టీపీసీసీ అధికారప్రతినిధి గౌరిసతీష్, చేవెళ్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌండ్ల నిరంజన్‌గౌడ్‌లు పేర్కొన్నారు. నగరంలోని ఏవీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు నక్కలపల్లి గ్రామంలో వారం రోజులపాటు చేపట్టిన సేవాకార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు గ్రామాల్లో ప్రజల సమస్యలను గుర్తించి వారికి న్యాయమైన సేవలను అందించేందుకు ఇలాంటి ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాజుగౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, నీలకంఠం, శ్రీకాంత్‌రెడ్డి, అంజయ్యగౌడ్, మల్లేష్, హరీష్ చారి, నర్సింహులు, గౌరి మధు, అర్జున్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


ఇంటింటికీ వెళ్లి వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థినులు


నక్కలపల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు

సుభాన్‌పూర్‌లో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

మహేశ్వరం : హైదరాబాద్ బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మహేశ్వరం మండలం సుభాన్‌పూర్ గ్రామంలో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు ఆదివారం నాలుగోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా విద్యార్థినులు గ్రామంలో పచ్చదనం పరిశుభ్రత, పర్యావరణాన్ని కాపాడడంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ పద్మాపాండు మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులు తమ గ్రామంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు సుభాన్‌పూర్, దిలావర్‌గూడ గ్రామాల్లో సైబర్‌నేరాలు, మహిళల భద్రత, లోన్‌యాప్, సోషల్‌మీడియా దుష్ప్రచారంపై అవగాహన కల్పించారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ

చౌడాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ మండలంలోని మక్త వెంకటాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద చౌడాపూర్ మండలంలోని మక్త వెంకటాపూర్ గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం విడతల వారీగా అమలు చేస్తుందని తెలిపారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు అవుతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు హన్మంత్ రాథోడ్, వెంకట్, సూర్యానాయక్, హీర్యా, గుండ్యానాయక్, రామారావు, లాలు రాథోడ్, సంతోష్, అభిరామ్, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

'అగ్నివీర్'కు అబ్దుల్ జబ్బార్ ఎంపిక



షాదూరు, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ శాఖలో విధులు నిర్వహించేందుకు షాదూరు మండలం చెన్‌గోముల్ గ్రామానికి చెందిన అబ్దుల్ జబ్బార్ ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన అబ్దుల్ అజీస్ టీ స్టాల్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పిల్లలను చదివిస్తున్నాడు. ఇదే క్రమంలో అజీస్ పెద్ద కుమారుడు అబ్దుల్‌జబ్బార్ ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొనగా ఎంపికయ్యాడు. తమ కష్టానికి ప్రతిఫలం లభించిందంటూ జబ్బర్ తల్లిదండ్రులుసంతోషం వ్యక్తం చేశారు. గ్రామస్తులు అభినందించారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

బషీరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మాజీద్‌లో తాండూరు ఎమ్మెల్యే సోదరుడు, కాంగ్రెస్‌పార్టీ మండల ఇన్‌చార్జి బుయ్యని సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఇఫ్తార్‌తో మతసామరస్యం పెరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో బస్సీలాల్, పకీరహ్మద్, రజాక్, హోటల్ మాజీద్, ఇమామ్, అడ్డ బషీర్ పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో సత్యనారాయణరెడ్డి, అజయ్‌ప్రసాద్



కావొద్దు గుండెకోత

- సరదా కోసం వెళ్తే ప్రాణాలు హరీ!
- కాపాడే ప్రయత్నంలోనూ మరణాలు
- ప్రతి వేసవిలోనూ ఘటనలు
- పిల్లలపై తల్లిదండ్రుల నిఘా తప్పనిసరి

చేవెళ్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విభిన్న వాతావరణానికి పెట్టింది పేరు చేవెళ్ల.. ఇక్కడ వర్షాలు, చలి, ఎండ అన్నీ ఎక్కువే.. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం చిన్నారులు, యువకులు, పెద్దలు ఈత కొట్టేందుకు బావులు, చెరువులు, కాల్వలు, కుంటలను ఆశ్రయిస్తుంటారు. నీటి లోతు తెలియక మునిగి విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. విద్యార్థులకు ఒక్కపూట బడులు నడుస్తుండగా మరికొన్ని రోజుల్లో వేసవి సెలవులు రానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు, యువకులు ఈతకు వెళ్లే సందర్భాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

మండు వేసవిలో చిన్నారులు, యువకులు చెరువులు, కుంటలు, కాల్వల్లో, వ్యవసాయ బావుల్లో ఈత కొట్టేందుకు ఆసక్తి చూపుతారు. ఈత మంచి వ్యాయామం. కానీ, ఈత నేర్చుకోకుండా నీటిలోకి దిగడం చాలా ప్రమాదకరం. చిన్నారులు, యువకులందరికీ ఈత రాకపోవడం, ప్రమాదకర ప్రదేశాల్లో హెచ్చరికలు లేకపోవడంతో స్నేహితులతోకలిసి నీటి వనరుల వద్దకు వెళ్లే పిల్లలు, యువకులు ప్రమాదాల అంచనా వేయలేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ప్రమాదాలకు నిలయమైన వాగులు, కుంటలు, చెరువులు, బావుల వద్ద నీటిపారుదాల శాఖ ఆధ్వర్యంలో బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈత విషయంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తగిన అవగాహన కల్పించాల్సి ఉంది. అలాగే పిల్లల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలి. నిపుణులైన శిక్షకుల పర్యవేక్షణలో మాత్రమే ఈత నేర్పించాలి. నీట మునిగేవారిని కాపాడే ప్రయత్నంలోనూ కొందరు ఈత వచ్చినవారు ప్రాణాలు కోల్పోతున్నారు. అగ్నిమాక, పోలీస్ శాఖ గజ ఈతగాళ్ల సహకారంతో రక్షించే మెళకువలపై అవగాహన కల్పించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

పిల్లలపై నిఘా తప్పనిసరి

- ప్రస్తుతం పాఠశాలలు ఒకటే పూట కొనసాగుతుండగా, త్వరలో వేసవి సెలవులు రానున్నాయి. దీంతో పిల్లలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలి. ఈత రానికారణంగా గట్టుమీద ఉండేవారు సైతం కాసేపటికి నీటిలో దిగుతుంటారు. ఇదే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈత నేర్పించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.
- ఈత విషయంలో పిల్లలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉంది. ఈత నేర్చుకునే సమయంలో పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి.
- బావులు, కాల్వలు, చెరువుల్లో ఈత కొట్టేముందు వాటి లోతును ముందుగానే పరిశీలించాలి. ఈత కొట్టే సమయంలో సరదాలు, పందేలు, అత్యుత్సాహం వంటివి వద్దు. అవి ప్రాణాలకే ముప్పు తెస్తాయి. పూర్తిగా ఈత వచ్చే వరకు లోతైన ప్రాంతానికి వెళ్లొద్దు. ఈత నేర్చుకునే సమయంలో ట్యూబులు, బెండ్లు వాడుతున్నప్పటికీ శిక్షకులు లేకుండా నీటిలోకి దిగడం మంచిది కాదు.

ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు



వేసవిలో ఎండ, వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు విద్యార్థులు స్నేహితులతో కలిసి దగ్గరలో ఉన్న చెరువులు, వ్యవసాయ బావుల్లో సరదా కోసం ఈతకు వెళ్తారు. ఈత నేర్పించాలను కుంటే శిక్షణకుడి ఆధ్వర్యంలో నేర్పించాలి. సరదా కోసం వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. వేసవిలో పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో ఓ కంట కనిపెడుతుండాలి.

- భూపాల్ శ్రీధర్, ఇన్‌స్పెక్టర్, చేవెళ్ల

పచ్చని చెట్లకు నిప్పు

బషీరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్-తాండూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో పెంచిన చెట్లు పలు చోట్ల అగ్నికి ఆహుతవుతున్నాయి. సమీప రైతులు కొందరు పొలాల్లోని చెత్తకు నిప్పుపెడుతుండడంతో చెట్ల అంటుకొని కాలి బూడిదవుతున్నాయి. ఈ విషయమై సంబంధిత గ్రామాల కార్యదర్శులను అడిగితే మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో రైతులు నిప్పు పెడుతున్నారని, చెట్ల వద్ద నిప్పు పెట్టొద్దని సూచించినా వినడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కాశీంపూర్‌లో దగ్ధమవుతున్న చెట్లు

నేడే ఈద్ ఉల్ ఫితర్

- రంజాన్ ప్రార్థనలకు

ఈద్గాలు, మసీదుల ముస్తాబు

మేడ్చల్ టౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి):రంజాన్ మాసం 29 రోజుల ఉపవాస దీక్షలు ఆదివారంతో పూర్తయ్యాయి. నేడు(సోమవారం) ఈద్ ఉల్ ఫితర్ పండుగ జరుపుకుంటున్నట్లు ముస్లిం పెద్దలు, మసీదుల ఇమామ్‌లు ఆదివారం ప్రకటించారు. ఈద్-ఉల్-ఫిత్ర్ ప్రార్థనలు నిర్వహించేందుకు పట్టణాలు, గ్రామాల్లోని మసీదులను ముస్తాబు చేశారు. మేడ్చల్ పట్టణం, అత్వేల్లిలోని ఈద్గాలను శుభ్రం చేయించారు. ప్రార్థనలు నిర్వహించే మసీదుల్లో ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని ముకుంద్ థియేటర్ వద్ద గల ఇద్గాను రంగులు వేయించి మున్సిపల్ సిబ్బందితో ఈద్గా పరిసరాలను శుభ్రం చేయించారు. మేడ్చల్ పట్టణంలో ముస్లింలు ఒకే సమయంలో ఒకే చోట ప్రార్థనలు చేసే వీలు లేకపోవటంతో ప్రార్థనలు నిర్వహించే సమయాన్ని మార్చారు.



రంజాన్ ప్రార్థనల కోసం ముస్తాబు చేస్తున్న మేడ్చల్ పట్టణంలోని ఈద్గా

పట్టణంలో ప్రార్థనల సమయాలివే..

ప్రధానంగా మేడ్చల్‌లోని ఈద్గాలో ఉదయం 8 గంటలకు, జిద షామధార్ దర్గా మసీదులో 8:30 గంటలకు, చెక్‌పోస్టు ఏక్ మినార్ మసీదులో 9 గంటలకు, మేడ్చల్‌లోని పెద్ద మసీదులో 9:30గంటలకు, అత్వెల్లి ఈద్గాలో 8గంటలకు, మసీదులో 9:30గంటలకు ఈదుల్ ఫితర్ ప్రార్థనల కోసం సమయాన్ని నిర్ధారించారు. ఈద్గాల వద్ద ప్రార్థనకు వచ్చే వారి కోసం నిర్వాహకులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేపట్టారు. వేసవి కాలం కావటంతో మసీదులు, ఈద్గాల్లో ఉదయం 10గంటల లోపు ప్రార్థనలు ముగించేలా చర్యలు తీసుకున్నారు.

కిటకిటలాడిన మేడ్చల్ మార్కెట్

రంజాన్ పండుగ సందర్భంగా అవసర పడే వంట సామగ్రి కొనేందుకు ముస్లింలు ఆదివారం పెద్దఎత్తున మేడ్చల్ మార్కెట్‌కు వచ్చారు. దీంతో స్థానిక దుకాణాలు కిటకిటలాడాయి. బట్టల దుకాణాలు, కిరాణ దుకాణాల్లో పెద్దఎత్తున కొనుగోళ్లు జరిగాయి. మేడ్చల్ పట్టణ వాసులే కాకుండా మండలంలోని వివిధ గ్రామాల ముస్లింలు మేడ్చల్ ప్రధాన మార్కెట్‌లో కొనుగోళ్లు జరిపారు.

పోలీసుల బందోబస్తు

రంజాన్ పండుగ సందర్భంగా మసీదుల్లో ఇద్గాల వద్ద నిర్వహించే ఈద్ ఉల్ పితర్ ప్రార్థనల సందర్భంగా మేడ్చల్ పోలీసులు ప్రత్యేకంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ప్రార్థనల వేళకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించిన పోలీసులు మేడ్చల్ పెద్ద మసీదు, ఈద్గాల వద్ద పెద్ద ఎత్తున, భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. పండుగ ప్రార్థనలు నిర్వహించే మసీదుల వద్ద నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పట్టణ సీఐ సత్యనారాయణ తెలిపారు.



మేడ్చల్ మార్కెట్‌లో సేమియాలు

ఆర్డీవో కార్యాలయంలో వెబ్ సిరీస్ సందడి

వికారాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం వెబ్ సిరీస్ సినిమా షూటింగ్ నిర్వహించారు. దీంతో అక్కడ సందడి నెలకొంది. 'చీకట్లో..' అనే వెబ్ సిరీస్ షూట్ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో నటుడు నాగచైతన్య సతీమణి శోభిత ధూళిపాల నటిస్తున్నట్లు తెలిపారు. షూటింగ్ సమయంలో ఆర్డీవో కార్యాలయానికి 'డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయం' అని బోర్డు ఏర్పాటు చేశారు. షూట్‌లో సీనియర్ నటుడు సురేష్ పాల్గొన్నారు.



వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద వెబ్ సిరీస్ షూటింగ్

రోడ్డుపై వెళ్తున్న బాలుడి కిడ్నాప్‌నకు యత్నం

- కిడ్నాపర్‌కు దేహశుద్ధి
- పోలీసులకు అప్పగింత

యాలాల, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): ఓ బాలుడిని కిడ్నాపర్ పట్టుకుని తీసుకెళ్తుండగా, తండా వాసులు గుర్తించి కిడ్నాపర్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన ఆదివారం యాలాల మండలంలో చోటు చేసుకుంది. యాలాల ఎస్ఐ గిరి, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్కెపల్లికి చెందిన పదేళ్ల బాలుడు భానుప్రసాద్‌ను ఓ కిడ్నాపర్ పట్టుకుని లక్ష్మీనారాయణపూర్‌వైపు తీసుకెళుతున్నాడు. మార్గమధ్యలో బాలుడి అరుపులు, కేకలు వినిపించడంతో పేర్కంపల్లి తండావాసులు గమనించి కిడ్నాపర్ పట్టుకున్నారు.



కిడ్నాప్‌నకు యత్నించిన వ్యక్తి

బాలుడిని ఎక్కడికి తీసుకెళుతున్నావని వివరాలు అడుగగా, అతడి నుంచి సమాధానం రాలేదు. అంతలోనే బాలుడి తండ్రి మల్లేశ్, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని తండా వాసులతో కలిసి కిడ్నాపర్‌కు దేహశుద్ధి చేశారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగించారు. అయితే పోలీసుల విచారణలో కిడ్నాపర్ మద్దూరు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి అని, అతడికి మతిస్థితిమితం లేదని తేలింది. ఇకపై పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని ఈ సందర్భంగా ఎస్ఐ పేర్కొన్నారు.

కలారి బృందానికి ఉగాది పురస్కారం

కొడంగల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కొడంగల్‌కు చెందిన కలారి బృందం ఉగాది పురస్కారం అందుకుంది. ప్రాచీన యుద్ధ కళకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు కలారి శిక్షకుడు రమేశ్ అన్నారు. కృషి, పట్టుదల, ఏకాగ్రత ఉంటే సాధించలేనిదేదీ లేదన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.



పురస్కారాన్ని అందుకుంటున్న కొడంగల్ కలారి బృందం

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన నిరంజన్‌రెడ్డి



మంత్రి కోమటిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నిరంజన్‌రెడ్డి, తదితరులు

ఆదిభట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ శాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని టీపీసీసీ సభ్యులు, ఆదిభట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ విశ్వావసు నామ తెలుగు సంవత్సరంలో భగవంతుడి దీవెనలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆయనతోపాటు కాంగ్రెస్ నాయకులు దేంది రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శివగౌడ్, ధనరాజ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులపై సీఎం తీరు దారుణం

యాచారం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో ఉపాధ్యాయులను కించపరిచేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం దారుణమని సేవ్ టీచర్స్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బొడ్డు రవి ఆదివారం ప్రకటనలో ఆరోపించారు. ఉపాధ్యాయులను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. ఎలాంటి సెలవులు లేకుండా బోధన చేయడానికి క్యాలెండర్ రూపొందిస్తే అందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తమకు 30 సంపాదిత సెలవులున్నాయనే విషయం విస్మరించడం ఆందోళన కలిగిస్తుందని పేర్కొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరం పిల్లల శ్రేయస్సు కోసం పాటుపడుతున్నామని తెలిపారు. సెలవుల రోజున సైతం బడికి వచ్చి బోధిస్తున్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. పాఠశాలల్లో కనీస వసతులపై సీఎం దృష్టి సారించకపోవడం విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు.

మాదారం యాదగిరి గౌడ్‌కు ఉగాది పురస్కారం

కడ్తాల్, మార్చి30(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయ ఉప ప్రధాన అర్చకుడు, తెలంగాణ అర్చక ఉద్యోగుల జేఏసీ ప్రధాన కార్యదర్శి మాదారం యాదగిరి గౌడ్‌కు రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం లభించింది. ఆదివారం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో రెవెన్యూ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామ్ అయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ పురస్కారాన్ని అందజేశారు. ఉగాది పురస్కారం అందుకున్న యాదగిరిని మైసిగండి ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ, ఈవో స్నేహలత, పలువురు అర్చకులు, నాయకులు, మైసిగండి ప్రజలు అభినందించారు.



యాదగిరికి పురస్కారం అందజేస్తున్న శైలజారామ్ అయ్యర్

కరుగుతున్న గుట్టలు



గొట్టిగకలాన్ గ్రామ సమీపంలో మట్టి తరలించడంతో ఒర్రెలా మారిన గుట్ట

బషీరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పకృతి సంపద కనుమరుగవుతోంది. ఫలితంగా బీడు భూములు, కొండలు, రాళ్ల గుట్టలు కూడా విలువైనవిగా మారుతున్నాయి. అక్రమ తవ్వకాలతో సహజసిద్ధంగా వెలసిన గుట్టలు రోజురోజుకూ కనుమరగవుతున్నాయి. గుట్టలను తవ్వి మట్టిని ఇళ్ల, రోడ్లు, వెంచర్లకు తరలిస్తూ వ్యాపారులు, కాంట్రాక్టర్లు సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ఎక్కడ చూసినా గుట్ట లు, ఎత్తైన అటవీ ప్రదేశాలు కన్పించేవి. ఇప్పుడు బీడు భూములు, అటవీ ప్రదేశాల్లో తవ్వకాలతో ఒర్రెలు, భారీ గుంతలు దర్శనమిస్తున్నాయి. ఇందుకు తార్కాణంగా మైల్వార్, గొట్టిగకలాన్, నీళ్లపల్లి, నవాల్గ తదితర అడవుల ప్రాంతాల్లో గుట్టలు ఇలా కరుగుతున్నాయి!

బసవేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

కొడంగల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వీరశైవ సమాజం ఆధ్వర్యంలో కొడంగల్‌లో బసవేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆదివారం వీరశైవ సంఘం నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు కోహూరు విజయ్‌వర్ధన్ మాట్లాడుతూ.. ఉగాది పర్వదినం నాడు భూమి పూజ చేయడం సంతోషకరంగా ఉందన్నారు. సమాజంలో మనుషులు ఎలా జీవించాలి, స్త్రీ పురుష లింగభేదాలు, కుల మత విభేదాలు లేకుండా జీవించాలని మహాత్మా బసవలింగేశ్వరుడు ఉద్బోధించా డని గుర్తు చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపనలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార కార్యదర్శి బుక్క విక్రమ్‌కుమార్, కోశాధికారి సూరారం ప్రకాశ్, కొడంగల్ పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డం శేఖర్, యువ సమాజ్ అధ్యక్షుడు తారాపూరం రవి, గంటి సర్వేశ్వర్, బొంరాస్‌పేట్ మండల గౌరవాధ్యక్షుడు జగదీశ్వర్, మద్దూర్ మండల ప్రధాన కార్యదర్శి మల్లేశం, మల్లికార్జున్ పాల్గొన్నారు.



ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేస్తున్న వీరశైవ సమాజ్ సంఘం నాయకులు

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు సమితి సభ్యులు అయ్యారి గోపాల చారి, రామగౌడ్, మధుసూదన్, దివకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చేవెళ్ల మున్సిపాల్ పట్టణ కేంద్రంలో చలివేంద్రాన్ని స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దహార్తిని తీర్చేందుకు ఏటా చలివేద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి, కానిస్టేబుల్ రవిగౌడ్, సమితి సభ్యులు మోహన్‌రెడ్డి, వెంకట్‌స్వామి, విజయ్, విఠలయ్య, విఠల్‌రెడ్డి, భాస్కర్, వెంకటేశ్, శంకరయ్య, సతీష్ ఉన్నారు.

యాచారం: మండలంలోని కుర్మిద్ద గ్రామంలో ఆదివారం సీపీఎం నాయకులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు చల్లటి నీటిని అందుబాటులో ఉంచుతామని నాయకులు సురేష్, గోవర్దన్, సంజీవకుమార్, అంజయ్య, చెన్నయ్య తెలిపారు.



చేవెళ్లలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల గ్రామంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ నాయకులు తిరుమణీరాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, పద్మాఅనిల్, రాజు, ప్రసాద్, శ్రీశైలం గౌడ్, విష్ణు, ఆజీజ్, విజయ్, ఆరీఫ్, అబ్బాస్, లక్ష్మణ్, శ్రీరామ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



యాచారం: కుర్మిద్దలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న సీపీఎం నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో దుగ్గి రాచప్ప జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శేఖరప్ప ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎండీ మక్బుల్, మల్లయ్య, జంగయ్య, మల్లేష్, వెంకటేష్, ఆమేర్, ఉమాపతి, గోపాల్, శ్రీను, పాష, అజాహర్, అశోక్, వజ్రలింగం, ఆంజనేయులు, మూర్తి, శివ, యాదయ్య, నసీర్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

మన్‌కీబాత్ వీక్షించిన బీజేపీ నేతలు



యాచారంలో మన్‌కీబాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ కార్యకర్తలు

యాచారం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నిర్వహిస్తున్న మన్‌కీబాత్ కార్యక్రమాన్ని బీజేపీ కార్యకర్తలు గంటల తరబడి టీవీలకు అంటిపెట్టుకొని తిలకిస్తున్నారు. ఆదివారం జరిగిన మన్‌కీబాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ హిందీలో మాట్లాడుతుండగా మధ్యలో వచ్చే యాడ్స్ సమయంలో కొందరు నాయకులు తెలుగులో తర్జుమా చేసి కార్యకర్తలకు వివరించారు. మన్‌కీబాత్ కార్యక్రమంతో దేశ సమగ్రతకు బీజేపీ చేస్తున్న కార్యకలాపాలను జనం ఆదరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు కొప్పు భాషా, పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ అన్నారు. మన్‌కీబాత్ కార్యక్రమాన్ని యాచారం, నందివనపర్తి, మాల్, నందివనపర్తి, చిన్నతూండ్ల, గున్‌గల్, కుర్మిద్ధ, తమ్మలోనిగూడ, నల్లవెల్లి గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు కార్యక్రమం ముగించేదాక తిల కించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నడికూడి కృష్ణ, వన్నవాడ రవీందర్‌రెడ్డి, పున్న శివకుమార్, గౌరిగె బీరప్ప, నీలం రమేష్, కాల్లెశ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా భద్రేశ్వరుడి రథచక్రాల పూజ



రథచక్రాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తాండూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల చరిత్ర ఉన్న తాండూరు శ్రీ భావిగి భద్రేశ్వరస్వామి రథచక్రాల పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని జాతరకు దేవుని రథచక్రాలు(పయ్యలు) బయటపెట్టి భద్రేశ్వరుడి నామస్మరణ మధ్య పూజ నిర్వహించారు. కాంపౌండ్ నుంచి రథచక్రాలను భద్రేశ్వరచౌక్ వరకు తీసుకువెళ్లి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీవోఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంపత్, భద్రేశ్వరస్వామి ఆలయ రెన్యూవేషన్ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్, ఈవో శేఖర్‌గౌడ్, సభ్యులు శెట్టి సురేష్, వీరశైవ లింగాయత్ ప్రతినిధులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

145వ రోజుకు చేరిన దీక్షలు

తలకొండపల్లి, మార్చి30(ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరంలోనైన గట్టిప్పలపల్లిని మండలకేంద్రంగా ప్రకటించాలని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పాలనా సౌలభ్యం కోసం తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం 145వ రోజుకు చేరాయి. దీక్షల్లో వివిధ పార్టీల నాయకులు, జేఏసీ, ప్రజా సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ, పార్టీల నాయకులు అశోక్‌గౌడ్, అంజనేయులు, వెంకటయ్య, కృష్ణయ్య, చంద్రశేఖర్ రెడ్డి, శరత్‌చంద్ర, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉగాది వేడుకలు


దుద్యాల: పోలెపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు


శామీర్‌పేట భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న రామకృష్ణశర్మ, వింటున్న గ్రామస్తులు


పరిగిలోని హనుమాన్ ఆలయంలో పంచాంగ శ్రవణాన్ని నిర్వహిస్తున్న పండితులు సిద్ధాంతి పార్థసారథి

వికారాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లో ప్రజలు ఆదివారం తెలుగు సంవత్సరాది విశ్వావసు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయమే ఇళ్లను శుభ్రం చేసుకొని స్నానాలు ఆచరించి ఇళ్లు, ఆలయాల్లో పూజలు నిర్వహించారు. షడ్రుచుల పచ్చడిని తయారు చేసి సేవించారు. భక్ష్యాలు, ఇతర తీపి వంటకాలు, పలు రకాల కూరగాయలు వండుకొని ఆరగించారు. వికారాబాద్‌లోని రామాలయం, మల్లికార్జునాలయం, హనుమాన్ ఆలయం, గ్రామాల్లో, కాలనీల్లోని ఆలయాల్లో సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సంవత్సరం భవిష్యత్తు ఎలా ఉండనుంది, పాడి పంటలు, రాశుల వారీగా పండితులు జ్యోతిష్యం చెప్పారు. మల్లికార్జునాలయంలో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రజలు, సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ నియోజకవర్గ ప్రజలకు విశ్వావసు నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తన నివాసంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పూజలు చేసి ఉగాది పచ్చడి సేవించారు. కార్యక్రమంలో నాయకులు నర్సిములు, అనంత్ రెడ్డి, గోపాల్, ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్, విజయ్‌కుమార్, పాండు, వేణుగోపాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి పాల్గొన్నారు.

పూడూరు: మండల కేంద్రంతోపాటు ఎన్కెపల్లి తదితర గ్రామాల్లో ప్రజలు ఉగాది పచ్చడి చేసుకుని, సంప్రదాయ వంటకాలు చేసి ఆలయాల్లో నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం అర్చకులు విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణాన్ని వినిపించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సురేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో ఉగాదిని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ రెడ్డియా నాయక్, సాయిరెడ్డి, శేఖర్, లక్ష్మీనారాయణ, దానయ్య, వెంకటస్వామి, శంకర్‌రెడ్డి, కెఎంరెడ్డి, సత్తిరెడ్డి యాదగిరి, జితేందర్, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దోమ: దోమలోని హనుమాన్ ఆలయంలో పురోహితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయాల వద్ద పచ్చడిని పంపిణీ చేశారు.

యాలాల: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ప్రజలు ఆలయాలను సందర్శించారు. సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహించారు.

కీసర: కీసరలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కీసరగుట్టలో ఉత్సవ మూర్తులను పల్లకీ సేవలో ఊరేగించారు. ఆలయ చైర్మన్, ఈవో, ట్రస్ట్ బోర్డు సభ్యులు, భక్తులు పల్లకీ సేవలో పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్/కొడంగల్ రూరల్: బొంరాస్‌పేట్, కొడంగల్, దౌల్తాబాద్ మండలాల్లో ఉగాది పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఆలయాల్లో పూజలు నిర్వహించారు. బొంరాస్‌పేట్‌లో పురోహితులు జ్యోషి శ్రీనివాసశర్మ, కొడంగల్ మండలం టేకులకోడ్ ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామస్థులకు పంచాంగం చదివి వినిపించారు.

పరిగి: ఉగాది వేడుకలను పరిగి, గ్రామాల్లో జరుపుకున్నారు. ఆలయాల వద్ద పంచాంగ పఠణం చేశారు. పరిగిలోని పోస్టాఫీసు, బాహర్‌పేట్ హనుమాన్ ఆలయాల్లో సిద్ధాంతి పార్థసారథి పంచాంగ శ్రవణం నిర్వహించారు.

మోమిన్‌పేట్/చౌడాపూర్/నవాబుపేట: మోమిన్‌పేట్ మండలం టేకులపల్లి భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. చౌడాపూర్, గ్రామాల్లో పురోహితులు ప్రజలకు పంచాంగం చదివి వినిపించారు. కార్యక్రమంలో కొత్త రంగారెడ్డి, బందెయ్య, వెంకటేశ్, లక్ష్మయ్య పాల్గొన్నారు. కొత్తపల్లిలో ఆంజనేయస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్‌లతో ఆలయం చుట్టూ ప్రదక్షణ చేశారు. నవాబుపేట, గ్రామాల్లో పండగను జరుపుకున్నారు.

తాండూరు రూరల్: కరన్‌కోట్, అంతారం, చెంగోల్, గోనూరు, బెల్కటూర్, గౌతాపూర్, మల్కాపూర్, మిట్టబాస్పల్లి గ్రామాల్లో ఉగాది వేడుకను ఘనంగా నిర్వహించారు. నారాయణపూర్‌లో రామారావు పంతులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సంవత్సరంలో వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడి పంటలకు బాగా పండుతాయని తెలిపారు. ఎర్రధాన్యాలు ఎక్కువ పండే అవకాశం ఉందని, తెల్ల ధాన్యం కూడా పండుతుందని వివరించారు.

శామీర్‌పేట: తూంకుంటలో ఉగాదిని ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కోట్‌పల్లి: మండల కేంద్రం, బార్వాద్, మోత్కుపల్లి, కొత్తపల్లి, జిన్నారం, ఎన్నారం గ్రామాల్లో ఉగాది పండగను జరపుకున్నారు. ఆలయాల వద్ద గ్రామస్తులు పంచాంగ శ్రవణంలో వారి రాశి ఫలాలు, వ్యవసాయ పనుల ముహూర్తాలను తెలుసుకున్నారు. నాయకులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: గ్రామాల్లో ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రతాప్‌సింగారంలోని భవానీ చంద్రమౌళీశ్వర ఆలయంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, గ్రామస్తులు పంచాంగ శ్రవణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అవుశాపూర్‌లోని ఉమామహేశ్వర ఆలయంలో, ఎదులాబాద్‌లోని మన్నారు రంగనాయకస్వామి ఆలయం, ఊర హనుమాన్ ఆలయాల్లో పండితులు పంచాంగం చదివి వినిపించారు.

దుద్యాల: దుద్యాల, గ్రామాల్లోని ఆలయాల్లో పురోహితులు పంచాంగం చదివి వినిపించారు. వివిధ రాశుల వారికి లాభ నష్టాల గురించి వివరించారు. పంటలు సమృద్ధిగా పండుతాయని పురోహితులు వివరించారు.

ధారూరు: ప్రజలు ఆలయాలకు వెళ్లి నైవేద్యం సమర్పించారు. ఉగాది పచ్చడిని పంచిపెట్టి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

కొడంగల్: కొడంగల్‌లోని వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉగాది పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. ఆస్థాన మండపాన్ని వివిధ రకాల పండ్లు నారింజ, పైనాపిల్, ద్రాక్ష, ఆపిల్‌తో అలంకరించారు. శ్రీమాన్ శ్రీనివాసచార్యులు విశ్వావసు నామ సంవత్సర ప్రాముఖ్యతను వివరించారు. పర్వదినం సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు.


తాండూరు రూరల్: నారాయణపూర్‌లో పంచాంగ శ్రవణం


తాండూరు రూరల్: ఉగాది సందర్భంగా పొలాన్ని దున్నుతున్న రైతు


పరిగి: ఆలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు


ప్రతాప్‌సింగారం చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


కీసరగుట్టలో స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు


మోమిన్‌పేట్: టేకులపల్లి భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో పంచాంగం వినిపిస్తున్న పురోహితులు


టేకుల్‌కోడ్‌లో పంచాంగం చదివి వినిపిస్తున్న పురోహితుడు

ప్రధాని మన్‌కీ బాత్‌ను వీక్షించిన నాయకులు


మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

మర్పల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం మర్పల్లి మండలంలో బీజేపీ నాయకులు వీక్షించారు. మండల బీజేపీ అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి సూచన మేరకు బూత్ నం.14 గుండ్ల మర్పల్లిలో బూత్ అధ్యక్షుడు మల్లేశ్ నివాసంలో వీక్షించారు. మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మండల ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బల్‌రాంగౌడ్, జైపాల్, శ్రీమంత్‌కుమార్, రమేశ్, రాజు, సుభాష్ పాల్గొన్నారు.

కొడంగల్ అభివృద్ధిని అడ్డుకుంటున్నదెవరు?


మాట్లాడుతున్న ఎస్‌బీ.గుల్షన్

కొడంగల్ రూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కొడంగల్ మున్సిపల్ అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేశామని చెబుతున్నా.. అభివృద్ధిని ఎవరు అడ్డుకుంటున్నారని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొడంగల్‌లో శిథిలావస్థలో ఉన్న షాదీఖానా నిర్మాణానికి ఎంఐఎం ఆధ్వర్యంలో పోరాటం చేస్తే ఇటీవలే ప్రభుత్వం నిధుల మంజూరుకు ప్రొసీడింగ్ ఇచ్చిందన్నారు. షాదీఖానా పనులు ఎందుకు చేపట్టడం లేదన్నారు. అంబేడ్కర్ చౌరస్తాను విస్తరిస్తామని విగ్రహాన్ని మాత్రం తొలగించారన్నారు. అయితే చౌరస్తాను విస్తరించకుండా నూతన విగ్రహ ఏర్పాటుకు దిమ్మె నిర్మించి రోడ్డు పక్కనున్న పాత ఫుట్‌పాత్ పనులే చేయడంలో ఆంతర్యం ఏమిటన్నారు. చౌరస్తా విస్తరణను ఎవరు, ఎందుకు అడ్డుకుంటున్నారో ప్రజలకు తెలపాలన్నారు. సీఎం నియోజకవర్గ కేంద్రంలోనే పనుల్లో నిర్లక్ష్యం సరికాదన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

బొంరాస్‌పేట్, మార్చి30(ఆంధ్రజ్యోతి):బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో ఆదివారం సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఉగాది పర్వదినాన పురోహితుల ఆధ్వర్యంలో గ్రామస్థులు మండల కేంద్రంలోని సంగమేశ్వరస్వామి భక్త సమాజం ఆవరణలో ఆలయ నిర్మాణానికి భూమి చేశారు. ఆలయ నిర్మాణంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా త్వరలో పూర్తి కావాలని గ్రామస్థులు ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారంతో భక్తులు సహకరించాలని కోరారు.


ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న పురోహితులు

రంజాన్‌కు ఈద్గాల ముస్తాబు


కరీంపూర్‌లో ముస్తాబైన ఈద్గా


శివారెడ్డిగూడలోని ఈద్గా వద్ద వేస్తున్న టెంట్

కోట్‌పల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోపాటు వివిధ గ్రామాలలో రంజాన్ పండగకు ముందుగానే ముస్లింలు ఈద్గల వద్ద, మాజీదులవద్ద ముస్తాబు చేశారు.

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో భారీ ఏర్పాటు చేశారు. సోమవారం రంజాన్ సందర్భంగా ఘట్‌కేసర్‌లోని ముస్లింలు శివారెడ్డిగూడలోని ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈద్గాలో శామియానా ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తారు. ప్రార్థనల అనంతరం నాయకులు. ప్రజాప్రతినిధులు, ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు చెబుతారు.

ఘట్‌కేసర్ రూరల్: రంజాన్ పండుగ సందర్భంగా మసీద్‌లను ముస్తాబు చేశారు. మర్రిపల్లిగూడ, అవుశాపూర్, అంకుశాపూర్, ఎదులాబాద్, కొర్రెముల, ప్రతాప్‌సింగారం, కాచవానిసింగారంలలో మసీద్‌లలో ప్రార్థనలకు వచ్చే వారికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు.

పెరిగిన ఉపాధి కూలి

- రోజుకు రూ.300 నుంచి రూ.307లకు పెంపు
- ఏప్రిల్ నుంచి అమలు
- తాండూరు సెగ్మెంట్‌లో 12,049 మంది కూలీలకు లబ్ధి


తాండూరు మండలంలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

తాండూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు రోజువారీ కూలి రేటు పెరిగింది. ప్రతీ ఏట మాదిరిగానే ఈ సారి కూడా ఉపాధి హామీ కూలి రేటును కేంద్ర ప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం గరిష్ఠంగా రోజు కూలి రూ.300 చెల్లిస్తున్నారు. కొలతల మేరకు రోజు పనిలో ఇదే అత్యధికం, ఒక వేళ కూలి తక్కువ పని చేస్తే ఇంతకంటే తక్కువే కూలి గిట్టుబాటు అవుతోంది. తాజాగా ఇప్పుడిస్తున్న కూలికి అదనంగా ఏడు రూపాయలు పెంచారు. రోజుకూలి రూ.307కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించింది. పెరిగిన కూలి మొత్తాన్ని కూలీలకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు చేస్తారు. కాగా మార్చి 2024 వరకు రూ.272 ఉండగా అదే ఏడాది ఏప్రిల్‌లో ఒక్కో రోజు కూలిని రూ.28 చొప్పున పెంచి రూ.300 చేశారు. ప్రస్తుతం 2025 ఆర్థిక సంవత్సరానికి రోజుకు రూ.7 పెంచారు. దీంతో కూలీలకు ఎంతో కొంత ఊరట లభించినట్టయింది. కాగా ఉపాధి స్కీంలో పనిచేస్తున్న కూలీలకు కూలి అంతంతే ఇస్తున్నారని, ఇచ్చే కూలి కూడా సకాలంలో ఇవ్వడం లేదని, 15 నుంచి ఇరవై రోజుల తర్వాతే కూలి డబ్బులను అకౌంట్లలో వేస్తున్నారని కూలీలు వాపోతున్నారు. కొన్ని సార్లు చేసి పనికి కూడా కూలి మొత్తం రావడం లేదని, ఫీల్డ్/టెక్నికల్ అసిస్టెంట్లు కొలతలు సరిగ్గా వేయక కూలీలు నష్టపోతున్నారని చెబుతున్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికి కూడా ఒక్క మనిషికి రోజువారీ ఖర్చు కనీసం రూ.150కి తక్కువ కావడం లేదంటున్నారు. ఒక వేళ కూలీలకు ఏదైనా అనారోగ్య సమస్యలు, అదనపు ఖర్చులొస్తే అప్పు చేయాల్సిందేనని అంటున్నారు. ఉపాధి పథకంలో కూలీలకిస్తున్న కూలితో పొట్ట గడవడానికే సరిపోతోందని అంటున్నారు. కనీస కూలి రూ.400కు పెంచాలని ప్రభుత్వాన్ని కూలీలు కోరుతున్నారు. కాగా తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, తాండూరు మండలాల పరిధిలో 12,049 మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారు. పెరిగిన కూలి రేటు నేపథ్యంలో వీరందరికీ రోజువారీ రూ.7 చొప్పున పెరగనున్నాయి.

ఖురాన్‌ను అందజేసిన మైనారిటీ నాయకులు

కొడంగల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక మక్కా మస్జీద్‌లో కాంగ్రెస్ నాయకులు తార్యా నాయక్, కృష్ణంరాజులకు మైనారిటీ నాయకులు తెలుగు అనువాద ఖురాన్ గ్రంథాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఎస్ఎం. గౌసన్, వాహెద్‌రాజ, అమీర్, అష్మత్, అహ్మద్‌ఖాన్, సాబేర్, జీయావుద్దీన్, రహమత్‌ఖాన్, మైమూద్ తదితరులు పాల్గొన్నారు.


తెలుగు అనువాద ఖురాన్‌ను అందిస్తున్న మైనారిటీ నాయకులు

హిందూముస్లింలు అన్నదమ్ముల్లా ఉండాలి

పరిగి,మార్చి 30(ఆంధ్రజ్యోతి):హిందు, ముస్లింలు అన్నదమ్ముల్లా కలిసి జీవించాలని టీడీపీ నాయకులు, పరిగి మాజీ జడ్పీటీసీ పి.చంద్రయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం పరిగిలోని మసీదులో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రంజాన్ మతసమరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉస్మాన్, అన్వర్‌సేట్, అభిరామ్, రఫీక్, మల్లేశ్ పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న చంద్రయ్య

మాతృశాఖపై అనాసక్తి!

(ఐదో పేజీ తరువాయి)

వ్యవస్థ సమర్థవంతమైన పని తీరు ప్రజాసేవల పంపిణీని నిర్ధారించడానికి జ్ఞానం, నైపుణ్యాలకు గుర్తించేందుకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ జీవో పూర్తిగా పూర్వ వీఆర్వో, వీఆర్ఏలకు వ్యతిరేకం గా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగ బాధ్యతలు ఇలా..

గ్రామ ఖాతాల నిర్వహణ, వివిధ సర్టిఫికెట్ల జారీ కోసం విచారణ నిర్వహించడం, ప్రభుత్వ భూములు, చెరువులు, నీటి వనరుల పర్యవేక్షణ, రక్షణ, ఆక్రమణలపై విచారణ, భూ సర్వేలలో సర్వేయర్లకు సాయం చేయుట, భూ వివాదాలను పరిశోధించడం, విపత్తు, విధులను నిర్వర్తించడం, అత్యవసర సేవలు అందించడం, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల కోసం లబ్ధిదారులను గుర్తించడం, ఎన్నికల సంబంధిత విధుల్లో సాయం చేయడం, ప్రొటోకాల్ అధికారులకు సాయం చేయుట, గ్రామ, క్లస్టర్, మండల స్థాయి అధికారులతో సమన్వయంతో ఉండాలి.

జీపీవో పేరుపై భిన్నాభిప్రాయాలు..

గ్రామ పాలన అధికారిగా పేరు పెట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి పూర్వపు మాదిరిగానే విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ లేదా మరో పేరును పెడితే బాగుంటుందని పలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుకాసురులు!


పట్టుబడిన ఇసుక లారీలు(ఫైల్)

(ఐదో పేజీ తరువాయి)

తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు స్థానికుల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

భారీగానే మామూళ్ల వసూళ్లు!

ఇసుక మాఫియా ద్వారా కొందరు అధికారులకు లక్షల రూపాయాలు ముడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు రెవెన్యూ, మైనింగ్, కిందిస్థాయి పోలీస్ సిబ్బంది ఏకంగా ఇసుక లారీలు వచ్చే సమయానికి రహస్య ప్రాంతానికి వెళ్లి నేరుగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. రెగ్యులర్‌గా నడిపించే వ్యాపారుల వద్ద ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు రూ.10 నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇదే లారీలకు రెట్టింపు వసూలు చేస్తున్నారు. అక్రమదారిన ఇసుక తరలింపు ద్వారా వే బిల్లులతో తీసుకొచ్చే ఇసుక ద్వారా తీవ్రంగా నష్టపోతున్నామని చెబుతున్నారు. ఇటీవల పరిగి మండలం మాదారం, నస్కల్, గడిసింగాపూర్ ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని డబ్బులు తీసుకుని వదివేసినట్లు తెలిసింది. ఇలా కులకచర్ల, దోమ, చన్‌గోముల్‌లలో కూడా భారీగా పోలీసులు మామూళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

కఠిన చర్యలు తప్పవు..



అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడి వరకు అనుమతి ఉంటే అక్కడే విక్రయించాలి. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే సీజ్ చేయిస్తాం. అక్రమ ఇసుక తరలిస్తున్నట్లు మా దృష్టికి తీసుక వస్తే కేసులు నమోదు చేస్తాం. అనుమతితో వెళ్తున్న వారిని కొందరు వ్యాపారులు అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది. వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటాం. - ఎం.సంతోష్, ఎస్ఐ, పరిగి

ప్రజల దాహార్తి తీర్చడమే ధ్యేయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్

శామీర్‌పేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఎండలు తీవ్రరూపం దాల్చడంతో ప్రజలకు చల్లని నీరు తాగించి దాహందీర్చడమే అమృత చలివేంద్రం ధ్యేయమని అలియాబాద్ మాజీ సర్పంచ్ వెంకటేశ్ అన్నారు. ఆదివారం అలియాబాద్ చౌరస్తా వద్ద శ్రీరామ ఆటోయూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వెంకటేశ్ ముఖ్య అతిథిగా వచ్చి ప్రారంభించారు. ఎండ కాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చుతున్న శ్రీరామ ఆటో యూనియన్ వారిని ఆయన అభినందించారు. సమాజ సేవచేస్తు ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, అలియాబాద్ మాజీ సర్పంచ్ గురుక కుమార్, తదితర నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడి మృతి


గొల్ల దశరథ్(ఫైల్)

బొంరాస్‌పేట్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడు మృతిచెందిన సంఘటన బొంరాస్‌పేట్ మండలంలో జరిగింది. మండలంలోని మెట్లకుంట గ్రామానికి చెందిన గొల్ల దశరథ్ శనివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లి వస్తుండగా వాహనంలోనే గుండెపోటుకు గురయ్యాడు. కారు డ్రైవ్ చేస్తూ వస్తుండగా ఎల్‌బీనగర్‌లో గుండె పోటుకు గురయ్యాడు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దశరథ్ మృతి పట్ల నాయకులు నర్సిములుగౌడ్, రాజేశ్‌రెడ్డి, జయకృష్ణ, వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి సంతాపం తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

చౌదరిగూడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కుటుంబ అవసరాల కోసం రోజువారీ ఖర్చుల కోసం చేసిన అప్పులను తీర్చలేక ఆందోళనకు గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కొందుర్గు మండలం ఉత్తరాస్‌పల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరాస్‌పల్లికి చెందిన మల్ల కుమార్ (28) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం ప్రైవేట్ బస్సు కొనేందుకు, కుటుంబ అవసరాలకు అప్పు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక కుమార్ చెట్టుకు ఉరేసుకున్నాడు. తన కుమారుడు అప్పుల బాధతోనే ఉరేసుకున్నట్టు కుమార్ తండ్రి అంజనేయులు తెలిపాడని ఎస్ఐ తెలిపారు.